సాక్షి
రంగారెడ్డి
బుధవారం । 20 । మార్చి । 2024



ప్రతిష్ఠాపనోత్సవాలు

కడ్తాల్ మండలం అన్మాస్‌పల్లి సమీపంలో నిర్మించిన ఆలయాల్లో విగ్రహప్రతిష్ఠాపన పూజలు వైభవంగా సాగుతున్నాయి. 8లో▸



దైవ చింతనతో ప్రశాంతత

దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ విశాల అన్నారు. 8లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సహర్ :
బుధవారం (సాయంత్రం)	గురువారం (ఉదయం)
6:33	4:58

న్యూస్‌రీల్

రైతుల సంక్షేమమే ధ్యేయం

డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కొత్తకుర్మ సత్తయ్య

తుర్కయంజాల్: రైతుల అభివృద్ధే ధ్యేయంగా సహకార సంఘాలు పనిచేస్తున్నాయని తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. తుర్కయంజాల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన 50వ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2022–23 ఆర్థిక సంవత్సరంలో జిల్లా సహకార ఆడిట్ అధికారి జారీచేసిన ఆడిట్ సర్టిఫికెట్ ప్రకారం సంఘానికి రూ.3,22,78,142 నికర లాభం వచ్చిందని తెలిపారు. రైతులు స్వల్ప కాలిక, దీర్ఘకాలిక, మధ్య కాలిక, వ్యవసాయ, వ్యవసాయేతర రుణాల కిస్తులు, వాయిదామీరిన కిస్తులు సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలని కోరారు. సభ్యులకు వ్యవసాయ పనిముట్లు, యంత్ర పరికరాలు, పవర్ వీడర్స్, షాప్ కటర్స్, టార్పలిన్ (కవర్లు), పిచికారీ పంపులపై సబ్సిడీని సంఘం భరించి అందిస్తోందని పేర్కొన్నారు. సంఘం సెక్రటరీ వై.రాందాసు సంఘం ఆదాయ, వ్యయాలను చదివి వినిపించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు వంగేటి లక్ష్మారెడ్డి, కొండ్రు స్వప్న, సామ సంజీవ రెడ్డి, చాపల యాదగిరి, సత్యనారాయణ రెడ్డి తదితరుల పాల్గొన్నారు.

మార్కెట్‌కు భారీగా మామిడి

సాక్షి, సిటీబ్యూరో: బాటసింగారం పండ్ల మార్కెట్‌కు మామిడి పోటెత్తింది. సోమ, మంగళ వారాల్లో ఈ సీజన్‌లోనే అత్యధికంగా 18–20 వేల టన్నుల వరకు మామిడి దిగుమతి అయినట్లు మార్కెట్ అధికారులు పేర్కొన్నారు. దిగుమతులు పెరగడంతో మొదటి రకం పండ్లు టన్ను ధర రూ.80 వేలు ఉండగా..మాములు రకం టన్ను 50–40 వేలకు చేరింది. దీంతో రిటైల్ మార్కెట్‌లో పండ్ల ధరలు కూడా తగ్గుతాయి. గత వారం కిలో మామిడి రూ.90 నుంచి 80 ఉండగా..మంగళ వారం రిటైల్ మార్కెట్‌లో రూ.70 లోపే ఉన్నాయి. ఈ ఏడాది మామిడి సీజన్ కాస్త లేట్ అయిందని, రేపటి నుంచి ఊపందుకునే అవకాశం ఉందని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి చిలుకా నర్సింహారెడ్డి తెలిపారు. ఏపీ, తెలంగాణలోని పలు జిల్లాల నుంచి మామిడి పంట ఇక్కడికి వస్తుందని చెప్పారు. మామిడి సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నామని ఆయన వెల్లడించారు.

‘ఆకర్షణ’కు అభినందన

- నగర చిన్నారికి ప్రధాని మోదీ ప్రశంసలు
- 25వ గ్రంథాలయ ప్రారంభోత్సవానికి వస్తానని హామీ



సనత్‌నగర్: చిరు ప్రాయంలోనే వేల సంఖ్యలో పుస్తకాలను సేకరించి 10 గ్రంథాలయాలను ఏర్పాటు చేసిన చిన్నారి ఆకర్షణను ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేకంగా అభినందించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా నగరానికి విచ్చేసిన మోదీని రాజ్‌భవన్‌లో తన తండ్రి సతీష్‌తో కలిసి ఆకర్షణ కలుసుకున్నారు. ఈ సందర్భంగా గతంలో మన్‌కీ బాత్‌లో ప్రధానితో మాట్లాడిన ఆ చిన్నారి ఇప్పుడు నేరుగా ఆయనను కలుసుకునే అవకాశం దక్కడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. తెలంగాణతో పాటు తమిళనాడు రాష్ట్రాల్లో ఆకర్షణ 10 గ్రంథాలయాలను ఏర్పాటు చేసి పఠనాశక్తిని పెంపొందింపజేస్తోంది. గ్రంథాలయాల ఏర్పాటును కొనసాగించాల్సిందిగా మోదీ ఆమెకు సూచించి ఆశీర్వదించారు. 25వ గ్రంథాలయ ప్రారంభోత్సవానికి తాను వస్తానని ప్రధాని హామీ ఇచ్చారని ఈ సందర్భంగా ఆకర్షణ తండ్రి సతీష్ తెలిపారు. 12 ఏళ్ల చిన్నారి ఆకర్షణ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న విషయం తెలిసిందే.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతగిరి: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఖాళీల భర్తీకి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టీఎస్ డబ్ల్యూఆర్ఎస్ అనంతగిరిపల్లి ప్రిన్సిపాల్ జేజే ప్రవీణ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 – 25 విద్యా సంవత్సరానికి గాను 6 నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో రూ.100 రుసుం చెల్లించి ఈ నెల 23 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సర్కార్ భూముల్లో సర్వే



మొండిగౌరెల్లి గ్రామ పరిధిలోని అసైన్డ్ భూమి

మొండిగౌరెల్లిలో కంపెనీల ఏర్పాటుకు సర్కార్ నిర్ణయం

- అసైన్డ్ భూముల సేకరణకు రంగం సిద్ధం
- సర్వే చేయాలని తహసీల్దార్‌కు ఆదేశాలు
- రెండు ప్రత్యేక బృందాలతో సర్వేకు సన్నద్ధం
- పూర్తయిన తర్వాత టీఎస్ఐఐసీకి అప్పగింత

యాచారం: మొండిగౌరెలి గ్రామంలో ఉన్న అసైన్డ్, ప్రభుత్వ భూముల్లో ప్రముఖ కంపెనీలను స్థాపించాలని రేవంత్‌రెడ్డి సర్కార్ సంకల్పించింది. గ్రామంలోని ప్రభుత్వ భూముల సరిహద్దులు నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారికి కిలోమీటర్ దూరంలో ఉండడం, నగరానికి కూత వేటు దూరంలో, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి 30 కిలోమీటర్ల దూరంలోనే ఉండడంతో వ్యాపారవేత్తల రాకపోకలకు ఇబ్బంది ఉండదని ప్రభుత్వం ఆలోచన. గ్రామంలో 2,19,68,107, 127,163,169 సర్వే నంబర్లలో 1,502.16 ఎకరాల అసైన్డ్, ప్రభుత్వ భూములున్నాయి. పలు విడతల్లో 715.14 ఎకరాల ప్రభుత్వ భూమిని అసైన్డ్ చేశారు. అసైన్డ్ కాని భూములు గుట్టలు, రాళ్లు, రప్పలతో కూడి ఉన్నాయి. కేసీఆర్ సర్కార్ హయాంలో సర్వేనంబర్ 19, 68 భూముల్లో చంచల్‌గూడ జైలు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. మండలపరిధిలోని నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో ఫార్మాసిటీకి 9 వేల ఎకరాలకు పైగా ప్రభుత్వ, అసైన్డ్ భూమిని సేకరిస్తున్న దృష్ట్యా ఇదే మండలంలో మళ్లీ భూసేకరణ చేపడితే రైతుల నుంచి వ్యతిరేకత వస్తుందని వెనుకడుగు వేశారు. తాజాగా రేవంత్‌రెడ్డి సర్కార్ ఆదేశాల మేరకు మొండిగౌరెల్లిలోని ప్రభుత్వ భూముల్లో డ్రోన్ పోర్ట్ ఏర్పాటు చేయాలని సర్వే నంబర్ 19లోని ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు సర్వే కూడా చేశారు. తాజాగా గ్రామంలోని పలు సర్వే నంబర్లలో పలు ప్రముఖ కంపెనీలు ఏర్పాటు చేయాలని సర్కార్ నిర్ణయించింది.

సర్వేతో వివరాల నిర్ధారణ

సర్కార్ ఆదేశాల మేరకు 19, 68, 127 సర్వేనంబర్లలోని ప్రభుత్వ, అసైన్డ్ భూమిని సర్వే చేయాలని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి యాచారం తహసీల్దార్ అయ్యప్పను ఆదేశించారు. అసైన్డ్, ప్రభుత్వ భూమిలో నిజమైన అసైన్డ్‌దారులు ఎంతమంది ఉన్నారు.. ఎన్ని ఎకరాల్లో అసైన్డ్ పట్టాలు పొందారు.. ఎన్నేళ్ల క్రితం అసైన్డ్ సర్టిఫికెట్లు పొందారు.. అసైన్డ్ సర్టిఫికెట్లు పొంది ఎంత మంది సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారు.. అసైన్డ్‌దారులకు భూ సరిహద్దులు సక్రమంగా ఉన్నాయా.. అసైన్డ్ సర్టిఫికెట్లు పొందకుండా నకిలీ సర్టిఫికెట్లు పొందిన వారు ఎవరైనా ఉన్నారా.. నకిలీలుంటే ఎలా ధరణి పోర్టల్‌లో నమోదు చేసుకున్నారు.. పట్టాదారు, పాసుపుస్తకాలు ఎలా పొందారు అనే వివరాలను సర్వే ద్వారా నిర్ధారించనున్నారు. రైతుల వారీగా భూములు సర్వే చేయడానికి రెండు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేయనున్నారు. తహసీల్దార్ పర్యవేక్షణలోని ఓ టీంలో ఆర్ఐ, సర్వేయర్, ముగ్గురు సిబ్బంది, మరో టీంలో ఆర్ఐ, సర్వేయర్, ముగ్గురు సిబ్బంది ఉండనున్నారు. సర్వే సమయంలో అసైన్డ్ పట్టాదారులకు ముందే సమాచారం ఇస్తారు.

గ్రామసభ ద్వారా సమాచారం

సర్వే పూర్తికాగానే రెవెన్యూ అధికారులు కంపెనీల ఏర్పాటుకు టీఎస్ఐఐసీకి భూముల వివరాలు అందిస్తారు. అనంతరం సర్కార్ కంపెనీలు ఏర్పాటు చేయదలిచిన వెంటనే అధికారులు గ్రామ సభ ద్వారా రైతులకు దేని కోసం భూములు సేకరిస్తున్నారనే వివరాలు తెలియజేస్తారు. ఏ కంపెనీలకు భూములు సేకరిస్తున్నారు, ఎకరాకు పరిహారం ఎంత ఇవ్వాలనే దానిపై స్పష్టత ఇస్తారు. రైతుల మెజార్టీ అభిప్రాయం మేరకే భూసేకరణ చేస్తారు. సర్వే అనంతరం తక్షణం 700 ఎకరాల్లో పలు కంపెనీలు ఏర్పాటు చేసేలా సర్కార్ సిద్ధంగా ఉందని ఓ రెవెన్యూ ఉన్నతాధికారి ‘సాక్షి’కి తెలిపారు. 19,68, 127 సర్వే నంబర్లలో సాగులో ఉన్న రైతులు వరి, కూరగాయలు, ఆకుకూరలు పండిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో భూము లిచ్చే విషయంలో ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

ఆ భూములే దిక్కు



సర్వేనంబర్ 19లో 5 ఎకరాల అసైన్డ్ పట్టా భూమి ఉంది. సాగుకు యోగ్యంగా మార్చుకోవడానికి రూ.5 లక్షలకు పైగా ఖర్చయింది. ఆ భూములు పోతే మాకు బతుకుదెరువు భారమవుతుంది.

– సంగెం లక్ష్మమ్మ, మహిళా రైతు, మొండిగౌరెల్లి

ముందుగానే సమాచారం

గ్రామంలోని 19, 68, 127 తదితర సర్వే నంబర్లలో అసైన్డ్, ప్రభుత్వ భూమిని సర్వే చేయాలని ఆదేశాలు వచ్చాయి. త్వరలో ప్రత్యేక టీంల ద్వారా సర్వే చేపడతాం. రైతులకు ముందుగానే సమాచారం ఇస్తాం. కంపెనీల ఏర్పాటు, మొదటగా ఎన్ని ఎకరాల భూమి సేకరిస్తుందనే విషయాలపై గ్రామసభ ద్వారా తెలియజేస్తాం.

– అయ్యప్ప, తహసీల్దార్, యాచారం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

జనం గుర్తిస్తేనే నాయకుడు

కామారెడ్డి ఎమ్మెల్యే కాటెపల్లి వెంకటరమణారెడ్డి

బడంగ్‌పేట్: భయపెట్టి, డబ్బులు పంచితేనే ఓట్లు పడతాయనడం సరికాదని.. జనం గుర్తిస్తేనే నాయకుడవుతాడని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. కార్పొరేషన్‌లోని సీకేఆర్, టీకేఆర్ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీకి అనుకూల వాతావరణం ఉందన్నారు. 2028లో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలు ప్రతి ఓటరు తలుపు తట్టాలని సూచించారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటేనని అన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసిన 50 శాతం, బీఆర్ఎస్‌కు ఓటేసిన 70 శాతం ఓటర్లు ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి వేయబోతున్నారని జోస్యం చెప్పారు. మోదీ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. భారీ మెజార్టీతో చేవెళ్లలో గెలిచి మోదీకి కానుకగా ఇవ్వాలన్నారు. సమావేశంలో మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంగయ్యయాదవ్, పాపయ్యగౌడ్, కొలన్ శంకర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం.. మతాతీతం



ముస్లిం రైతుకు ఎద్దును అందజేస్తున్న అర్చకుడు రంగరాజన్

- ముస్లిం రైతుకు ఎద్దు అందజేసిన చిలుకూరు అర్చకుడు రంగరాజన్

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్ మానవత్వం చాటుకున్నారు. మూడు రోజుల క్రితం చిలుకూరు గ్రామానికి చెందిన ముస్లిం రైతు ఎద్దు విద్యుదాఘాతంతో మృతి చెందడంతో ఆయనకు ఎద్దును అందజేశారు. గ్రామానికి చెందిన మహ్మద్ గౌస్ ఎద్దు ఈ నెల 15న ఉదయం మేతమేస్తుండగా 11 కేవీ విద్యుత్ తీగలు తెగిపడి అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలియడంతో రంగరాజన్ స్పందించారు. ఆలయ ప్రాంగణంలో తాను నిర్వహిస్తున్న గోశాల నుంచి మంగళవారం ఉదయం బాధితుడికి ఎద్దును అందజేశారు.

రైతులకు అండగా..

రంగరాజన్ కొన్నేళ్లుగా రైతులకు అండగా నిలుస్తున్నారు. విద్యుదాఘాతం, పిడుగుపాటుతో పశువులు, ఎద్దులు మరణిస్తే రైతుల పడే బాధను చూసి చలించిపోతున్నారు. మానవతా దృక్పథంతో వారికి జరిగిన నష్టాన్ని కొంతైనా పూడ్చాలనే సంకల్పంతో ఆదుకునే ప్రయత్నం చేస్తున్నారు. కొంత కాలం క్రితం మొయినాబాద్ మండలం పెద్దమంగళారం గ్రామానికి చెందిన అంజయ్య అనే రైతు రెండు ఎద్దు విద్యుదాఘాతంతో మరణించడంతో ఆయనకు తన గోశాల నుంచి రెండు ఎద్దులను అందజేశారు. సిద్దిపేటకు చెందిన రైతు ఆవు విద్యుదాఘాతంతో మరణించడంతో ఆయనను చిలుకూరు బాలాజీ దేవాలయానికి తీసుకొచ్చి ఆవును అందజేశారు. ఈ సందర్భంగా రంగరాజన్ మాట్లాడుతూ.. కొంత కాలంగా కొంత మంది రైతులను ఆదుకున్నామని, వారికి అవసరమైన ఆవులు, ఎద్దులను అందజేశామని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాల కారణంగా పశువులు చనిపోయి రైతులకు నష్టం జరిగితే ఆదుకునేందుకు మానవతావాదులు ముందుకురావాలని కోరారు.

ఆయిల్‌పామ్ సాగుకు ఆసక్తి



గోపులారంలో ఆయిల్‌పామ్ సాగు చేసిన రైతులు

- మూడేళ్లపాటు అంతర పంటలకు అనుకూలం
- నాలుగో ఏడాది నుంచి కాత
- జిల్లాలో 5,500 ఎకరాల్లో లక్ష్యం

షాబాద్: సంప్రదాయ పంటలతో కుస్తీ పడుతున్న రైతులు సేద్యంలో నూతన అధ్యయానికి శ్రీకారం చుట్టారు. అధిక లాభాలు గడించేందుకు ఆయిల్ పామ్ సాగుకు ఆసక్తి చూపుతున్నారు. తొలిసారిగా ఆయిల్‌పామ్ సాగు చేసిన నేపథ్యంలో పంట సాగుకు విధానం అనుసరించాల్సిన పద్ధతులపై రైతులకు జిల్లా ఉద్యానశాఖ అవగాహన కల్పిస్తోంది. జిల్లా రైతులకు ఆర్థికంగా అండగా ఉండేలా వాణిజ్య పంటను ఉద్యానశాఖ పరిచయం చేసింది. ఏడాది క్రితం నాటిన మొక్కలు ఎదుగుతున్నాయి. భూగర్భ జలాలు పెరగడంతో వరి సాగు విస్తీర్ణం పెరిగింది. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోవాల్సి వస్తోంది. దీంతో రైతులకు ఉపాధిబాటను చూపేందుకు జిల్లా అధికారులు 2023లో ఆయిల్ పామ్ సాగుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఆసక్తి గల రైతులకు ఆ పంటసాగుపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ

జిల్లాలో 5,500 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగుకు ఉద్యానశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. కేంద్రం అందజేస్తున్న సబ్సిడీకి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం కొంత మొత్తం ఇవ్వాలని నిర్ణయించింది. ఆయిల్ పామ్ సాగుకు కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు కేటాయిస్తున్నాయి. ఆయిల్‌పామ్ మొక్కలు నాటిన తర్వాత నాలుగో ఏడాది నుంచి కాపు మొదలై 30 ఏళ్ల పాటు నిరంతరం ఆదాయాన్ని పొందొచ్చు. మొదటి మూడేళ్ల మొక్కల మధ్యలో అంతర పంటలను సాగు చేసుకోవచ్చు.

అనువైన నేలలు

అయిల్‌పామ్ సాగుకు ఇక్కడ నేలలు అనుకూలం. దేశంలో వంట నూనె వినియోగం ఎక్కువ. ఇందుకు విదేశాల నుంచి పామాయిల్ గింజలను దిగుమతి చేసుకుంటున్నాం. ఈ నేపథ్యంలో ఆయిల్ పామ్ సాగుకు రైతులను ప్రోత్సహించేలా రాష్ట్రం చర్యలు తీసుకుంటోంది. ఈ పంట ఎక్కువగా మలేషియా, ఇండోనేషియా దేశాలు ఆర్థి కాభివృద్ధి సాధించాయి. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును పెంచేందుకు ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తోంది.

వంద శాతం రాయితీపై డ్రిప్

ఆయిల్ పామ్ సాగు చేసే ఎస్సీ, ఎస్టీ రైతులకు బిందు సేద్యం పరికరాలను వంద శాతం సబ్సిడీపై ఇస్తున్నారు. బీసీ రైతులకు 90 శాతం, ఇతర రైతులకు 80 శాతం రాయితీపై సాగు నీటి పారుదల పరికరాలు ఇస్తారు. ఐదు హెక్టార్ల వరకు, దివ్యాంగులకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇలా ఆయిల్ పామ్ రైతులకు 125 ఎకరాల వరకు డ్రిప్ పరికరాలకు రాయితీ ఇస్తారు.

ప్రయోజనాలు

- ఎకరా వరిసాగుకు వినియోగించే నీటితో మూడెకరాల ఆయిల్ సాగు చేయొచ్చు.
- మూడేళ్లపాటు అరటి, మిరప, సోయాబీన్, పసుపు, కూరగాయలు, పూలు, నువ్వులు, వేరుశనగ, పొద్దు తిరుగుడును అంతర పంటలుగా సాగు చేయొచ్చు.
- ఒక టన్ను గింజల ధర రూ.19వేలు ఉంది.
- ఎకరాకు 10 నుంచి 12 టన్నుల దిగుబడి వస్తుంది.
- ప్రకృతి వైపరీత్యాల బెడద ఉండదు.
- రైతులకు ప్రతీ ఏడాది నికర ఆదాయం 30 ఏళ్ల వరకు పంట దిగుబడి ఉంటుంది.
- వరి పంటతో పోల్చితే శ్రమ తక్కువ.

రైతులకు లాభదాయకం



ఆయిల్‌పామ్ సాగు రైతులకు లాభదాయకం. ప్రభుత్వం మొక్కలు, డ్రిప్‌పై సబ్సిడీలు ఇస్తోంది. నాగుగేళ్ల పాటు ఎకరాకు రూ.4,200 చొప్పున రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తుంది. ఈ పంటకు కోతులు, పందులు, పక్షుల బెడద. అలాగే ప్రకృతి విపత్తులతో నష్టం ఉండదు. మొక్కలు నాటిన ఐదో సంవత్సరం నుంచి గెలలు వేస్తాయి. అప్పటి నుంచి ఎకరానికి ఏటా రూ.లక్ష వరకు ఆదాయం వస్తుంది. రైతులకు తక్కువ పెట్టుబడితో మంచి ఆదాయం ఉంటుంది.

– అశోక్, చేవెళ్ల డివిజన్ ఉద్యానశాఖ అధికారి

గోమాత ఎంతో శ్రేష్ఠమైనది

తాండూరు టౌన్: గోమాత ఎంతో శ్రేష్ఠమైనదని, నిత్యం పూజ చేస్తే మానసిక ప్రశాంతత కలుగుతుందని ప్రవచన కర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. తాండూరు ఆదర్శనగర్ పార్కులో మంగళవారం గోశాల దశాబ్ది ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోటేశ్వరరావు మాట్లాడుతూ.. గోవు ఎంతో పవిత్రమైనదని అన్నారు. దాని శరీరం నుంచి వచ్చేది ఏదీ కూడా వ్యర్థం కాదన్నారు. గోమూత్రం, గోపేడలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయని తెలిపారు.

సెక్టోరల్ పాత్ర కీలకం

- అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి
- విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు
- కలెక్టర్ శశాంక



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఎన్నికల సెక్టోరల్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో పరిస్థితులను ముందుగానే గమనిస్తూ, ఎప్పటికప్పుడు ఎన్నికల అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. బాధ్యతాయుతంగా పని చేయాలని.. ప్రశాంత వాతావరణంలో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో తాజా స్థితిగతులు.. గత ఎన్నికల్లో చోటు చేసుకున్న సంఘటనలు, వివిధ అంశాల ప్రాతిపదికన సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి నిర్ణీత గడువులోపు పూర్తి వివరాలతో ప్రాథమిక నివేదికను సహాయ రిటర్నింగ్ అధికారులకు సమర్పించాలని ఆదేశించారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన మూడు రోజుల్లోపు తుది నివేదిక అందించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి సంగీత, ఎంసీసీ నోడల్ అధికారి సౌమ్య, ఎన్నికల వ్యయం నోడల్ అధికారి సురేష్ మోహన్, ఏఆర్ ఈఓలు, సెక్టోరల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు

ఎన్నికల విధులను పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని కలెక్టర్ శశాంక సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం స్టాటిస్టిక్ సర్వైలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నిఘా బృందాలు సమర్థవంతంగా, నిబద్ధతతో బాధ్యత నిర్వర్తించాలని అన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలను తప్పనిసరి పాటించాలని, అన్ని పార్టీలు, అభ్యర్థులతో నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే నగదు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని తెలిపారు. ఎన్నికల వ్యయం, ప్రచార సరళిపై అనునిత్యం నిఘా ఉంచాలన్నారు. యాభై వేల నుంచి పది లక్షల మధ్య లావాదేవీలు జరిగితే కచ్చితంగా రసీదు ఉండాలని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి సంగీత, ఎంసీసీ నోడల్ అధికారి సౌమ్య, ఎన్నికల వ్యయం నోడల్ అధికారి సురేష్ మోహన్, ఏఆర్ఈఓలు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

బాధ్యతతో పనిచేయాలి

నోడల్ అధికారులు బాధ్యతతో పని చేయాలని కలెక్టర్ అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో మంగళవారం నోడల్ అధికారులతో సమావేశమయ్యారు. చేవెళ్ల, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, పరిగి, తాండూరు, వికారాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంటింటి సర్వే నిర్వహించి 85 ఏళ్ల పైబడిన వారిని, దివ్యాంగులను గుర్తించి.. వారికి ఇంటి నుంచే ఓటు వేసే వెసులుబాటు కల్పించాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన ఐదు రోజుల్లోపు 12–డి ఫారం భర్తీ చేసి బీఎల్ఓలకు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఉండేలా చూసుకోవాలన్నారు. అంతర్ రాష్ట్ర చెక్ పోస్టుల వద్ద నిఘా పెట్టాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీలక్ష్మి, గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు.

బెల్ట్‌షాప్‌పై పోలీసుల దాడి

మద్యం బాటిళ్లు స్వాధీనం

చేవెళ్ల: బెల్ట్‌షాప్‌పై దాడి చేసిన పోలీసులు 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అమ్ముతున్న వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఈ ఘటన శంకర్‌పల్లి మండలం లక్ష్మారెడ్డిగూడలో చోటు చేసుకుంది. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన ప్రకారం.. గ్రామానికి గోపాల్‌గౌడ్ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు దాడులు నిర్వహించగా 30 మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. వాటిని సీజ్ చేసి నిర్వాహకుడిపై కేసు నమోదు చేశామన్నారు.

రసాయనశాస్త్రంలో ఇద్దరికి డాక్టరేట్



అరుణ్‌కుమార్



జనార్దన్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో రసాయన శాస్త్ర విభాగంలో ఇద్దరు డాక్టరేట్ అందుకున్నారు. ప్రొఫెసర్ రవీందర్ మంచాల్ పర్యవేక్షణలో అరుణ్‌కుమార్ లింగాల, జనార్దన్‌రెడ్డి దేశిరెడ్డి చేసిన పరిశోధనలకుగాను వర్సిటీ వీసీ డాక్టర్ సీహెచ్. పురుషోత్తమ్‌రెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేట్ అధికారి డాక్టర్ సాత్వికరెడ్డి డాక్టరేట్ ప్రదానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన పరిశోధనలతో సమాజానికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. అభినందించిన వారిలో రిజిస్ట్రార్ రవీందర్, ప్రొఫెసర్ కవిత, రీసర్చ్ డీన్ కిష్టఫర్, డీన్ సైన్స్ సుందర్ రామ్, అడ్మినిస్ట్రేట్ డీన్ రాజు, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ రాంబాబు తదితరులున్నారు.

కార్మికుల ముసుగులో గంజాయి అమ్మకం

ఇద్దరి అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

కొత్తూరు: కార్మికుల ముసుగులో పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎస్‌ఓటీ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం స్థానిక పోలీసులకు అప్పగించారు. కొత్తూరు పట్టణానికి చెందిన ప్రకాశ్(22) శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రాళ్లగూడకు చెందిన వెంకటేష్(40)కు కొన్ని నెలలక్రితం పరిచయం ఏర్పడింది. ఇద్దరూ గంజాయి సేవిస్తుంటారు. ధూల్‌పేట నుంచి గంజాయి తీసుకొచ్చి కొత్తూరులో విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ పోలీసులు వారిపై నిఘాపెట్టి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 320 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

ఆలయ భూముల కౌలుకు వేలం

దేవాదాయ దర్మదాయశాఖ ఈఓ శ్రీనివాస్

షాబాద్: వేణుగోపాలస్వామి భూముల కౌలుకు వేలం నిర్వహిస్తున్నట్లు దేవాదాయ దర్మదాయశాఖ ఈఓ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి భూముల కౌలు సందర్భంగా ఆసక్తి కలిగిన రైతులు ఏప్రిల్ 1 నుంచి 11 గంటలకు దేవస్థానం వద్ద నిర్వహించనున్న బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు. ఈ భూములకు మూడు సంవత్సరాల కాల పరిమితి ఇవ్వనున్నట్లు ఈఓ పేర్కొన్నారు. ఈ వేలంలో గ్రామస్తులు, భక్తులు హాజరు కావలని ఆయన తెలిపారు.

వైభవంగా ప్రతిష్ఠాపనోత్సవాలు



విగ్రహాలకు జలాధివాస పూజలు నిర్వహిస్తున్న పండితులు



హాజరైన సినీ నటుడు సుమన్ తదితరులు

హాజరైన సినీనటుడు సుమన్

కడ్తాల్: మండల పరిధిలోని అన్మాస్‌పల్లి సమీపంలో కొర్పోలు లీలాలక్ష్మారెడ్డి దంపతుల సహకారంతో నిర్మించిన నూతన ఆలయాల్లో విగ్రహప్రతిష్ఠాపన పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సినీ నటుడు సుమన్, ఫార్చ్యూన్ బటర్‌ఫ్లై సిటీ సీఎండీ శేషగిరిరావు, ఈడీ రమేశ్, మహేశ్వర మహాపిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, వందేమాతరం ఫౌండేషన్ చైర్మన్ రవీందర్, శ్రీరామేశ్వర వీరాంజనేయ క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సినీ నటుడు సుమన్ మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణాలతో గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక చింతన పెంపొందుతుందన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు అతిథులను ఘనంగా సన్మానించారు. ప్రతిష్ఠాపన ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, సుధీర్‌రెడ్డి, పాపిరెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్, రాజు, జగన్, కేశవులు, రామకృష్ణ, నర్సింహ, పర్వతాలు, కృష్ణయ్య, శ్రీరాములుగౌడ్, నిరంజన్, యాదయ్య, వెంకటేశ్, కుమార్, రజనీకాంత్ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి: సుమన్

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సినీ నటుడు సుమన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలో అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలో కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎర్త్ సెంటర్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ.. పర్యావరణంపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఎర్త్ సెంటర్‌లో విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ సేవలను ప్రశంసించారు అనంతరం ఫార్చ్యూన్ బటర్‌ఫ్లై సిటీ సీఎండీ శేషగిరిరావు మాట్లాడుతూ.. సీజీఆర్ సంస్థ ఆధ్వర్యంలో 12 లక్షల మంది విద్యార్థులు తెలుగు రాష్ట్రాల్లో 36 లక్షల మొక్కలను సంరక్షించడం ప్రశంసనీయమన్నారు. అనంతరం సీజీఆర్ చైర్ పర్సన్ లీలా లక్ష్మారెడ్డి, సంస్థ వ్యవస్థాపకులు లక్ష్మారెడ్డి సినీ నటుడు సుమన్‌కు మొక్కతో పాటు, ఈస్టర్న్ ఘాట్స్ ఎన్విరాన్‌మెంట్ ఔట్ లుక్ పుస్తకాన్ని అందజేశారు.

కర్మకాండకు వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల

16 తులాల బంగారం, రూ. 2లక్షల నగదు అపహరణ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: కర్మఖాండకు వెళ్లొచ్చే సరికి ఇల్లు గుల్లా చేశారు. ఇంటి తాళాలు పగలగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు బంగారు ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా, పెద్దఅడిశర్లపల్లి గ్రామానికి చెందిన గంజి యాదగిరి ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలో బొంగ్లూర్‌లోని రాఘవేంద్రహోమ్స్‌లో నివాసం ఉంటూ హాస్టల్స్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 7వ తేదీన గంజి యాదగిరి తల్లి సత్తమ్మ మృతి చెందడంతో పెద్ద కర్మ జరిపే నిమిత్తం 16వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి వెళ్లాడు. 18వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు ఇంటికి వచ్చి చూడగా మెయిన్‌డోర్ తాళం విరగొట్టి ఉండటం గమనించాడు. లోపలికి వెళ్లి చూసేసరికి బీరువా పగలగొట్టి ఉంది. బంగారు ఆభరణాలు సుమారు 16 తులాల వరకూ, రూ.2 లక్షలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. వెంటనే ఈ విషయాన్ని పోలీసులకు తెలిపాడు. యాదగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లయిన మూడు రోజులకే..

• రోడ్డు ప్రమాదం • చికిత్స పొందుతున్న వరుడి మృతి



ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

షాబాద్: పెళ్లయిన మూడు రోజులకే వరుడి కుటుంబంలో విషాదం నెలకొంది. రోడ్డు ప్రమాదంతో చికిత్స పొందుతున్న యువకుడు మంగళవారం మృత్యువాత పడ్డారు. ఈ ఘటన మండల పరిధిలోని నాగర్‌కుంట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన ప్రవీణ్ కుమార్(25)కు అదే గ్రామానికి చెందిన యువతితో ఈ నెల 13న వివాహమైంది. 16న తన స్కూటీపై బావమరిది, కేతిరెడ్డిపల్లికి చెందిన సూర్యను హైతాబాద్‌లో దింపేందుకు.. కార్వాన్‌కు చెందిన మరో బావమరిది సూర్యతో కలిసి వెళ్లాడు. హైతాబాద్‌లో సూర్యను దింపి వస్తుండగా అంతిరెడ్డిగూడ వద్ద వాహనం అదుపుతప్పి ప్రీకాస్ట్ ప్రహరీని ఢీకొట్టింది. ఈ ఘటనలో కార్వాన్‌కు చెందిన సూర్య స్వల్పంగా గాయపడగా ప్రవీణ్‌కు తీవ్రగాయాలయ్యాయి. అతనికి శంషాబాద్‌లో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వరుడు మంగళవారం మృతి చెందాడు. మృతుడి బాబాయి శివరాజ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆఫర్ల పేరుతో కస్టమర్లకు టోకరా

• టాస్కుల పేరిట మోసాలు
• రూ. 1,08,323 పోగొట్టుకున్న యువకుడు
• ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆఫర్ల పేరుతో ఆన్‌లైన్లో కస్టమర్లకు ఎరవేస్తున్నారు. టాస్కులు పూర్తి చేస్తే మీ ఖాతాల్లో రెట్టింపు నగదు జమచేస్తామని ఆశ చూపి మంత్రమాల్ పేరిట ఓ సంస్థ మోసాలకు పాల్పడుతుంది. ఈ ఘటనలో ఓ యువకుడు మోసపోయాడు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి వెల్లడించారు. ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలపూర్ మండలం, కుర్మల్‌గూడకు చెందిన గర్వంద రమేశ్ ప్రైయివేటు ఉద్యోగం చేస్తు జీవిస్తుంటాడు. ఈ నెల 12వ తేదీన పార్ట్‌టైం ఉద్యోగం కోసం గూగుల్‌లో సెర్చ్ చేశాడు. అందులో 62856 0340 93902 పై క్లిక్ చేశాడు. వెంటనే తన మొబైల్ ఫోన్లో వాట్సాప్ ఓపెన్ అయ్యింది. అందులో తన వివరాలు నమోదు చేశాడు. అతనికి వచ్చిన లింక్‌ను ఓపెన్ చేశాడు. దీంట్లో మంత్రకు సంబంధించిన ప్రొడక్టులు కొనుగోలు చేస్తే పెద్ద మొత్తంలో డబ్బు వస్తుందని ఆఫర్ చేశారు. మొదటగా రూ.500లు ఫోన్‌పే చేశాడు. తర్వాత మరి కొన్ని టాస్కులు పూర్తి చేశాడు. ఇలా చేస్తూ ఒక్కొక్క టాస్కుకు కొంత నగదు గెల్చుకున్నాడు. ఈ నెల 15వ తేదీన ఇలాగే చేశాడు. రూ.286, రూ.183 నుంచి మొదలుకొని ఆయా మొత్తంలో నగదు గెల్చుకుంటూ పోయాడు. చివరగా రూ.1,08,323లు టాస్కులో వెచ్చించాడు. గెలిచిన నగదు డ్రా చేసుకోవాలంటే రూ.50 వేలు చెల్లించాలని చెప్పారు. దీంతో అనుమానం వచ్చిన రమేశ్ 1930 సైబర్ క్రైంకి ఫోన్ చేశాడు. అనంతరం ఈ నెల 18న సాయంత్రం ఆదిబట్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు.

పిడుగుపాటుకు ఆవు మృతి



ఆవు కళేభరం వద్ద రైతు

చేవెళ్ల: పశువుల పాకపై పిడుగు పడడంతో పాకలో కట్టేసిన పాడి ఆవు మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని ఆలూరులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన వెంకటయ్యకు జెర్సీ ఆవు ఉంది. రోజు మాదిరిగానే ఆవును పాకలో కట్టేశారు. సాయంత్రం నుంచి కురిసిన అకాల వర్షానికి పాకపై పిడుగు పడడంతో ఆవు మృత్యువాత పడింది. రైతుకు జీవనాధారమైన ఆవు చనిపోవడంతో బోరున విలపించాడు. ఈ విషయాన్ని పంచాయతీ దృష్టికి, పశువైద్యుల దృష్టికి తీసుకెళ్లాడు. ప్రభుత్వం న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

అగస్త్య ఫౌండేషన్‌తో ఐదేళ్ల ఒప్పందం

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలత

చేవెళ్ల: విద్యార్థులను నూతన ఆవిష్కరణల దిశగా ప్రోత్సహించేందుకు అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఒప్పందం సహకరిస్తోందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలత అన్నారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఐదేళ్లకు ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఈ ఒప్పందంతో విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీయవచ్చన్నారు. అగస్త్యఫౌండేషన్ శాస్త్రీయ అవగాహన పెంచేందుకు కృషిచేస్తోందనిచెప్పారు. అనంతరం ఫౌండేషన్ సభ్యులు దశరథ్, శ్రావణ్‌కుమార్, రమేశ్ మాట్లాడుతూ.. దేశంలో ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల ఆత్మవిశ్వాసం పెంపొందిచడమే లక్ష్యంగా ఫౌండేషన్ పనిచేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు అనురాధ, షేక్ మహబూబ్, వైష్ణవి, రూప్నారవీంద్రన్, డాక్టర్ జ్యోతి, సతీశ్, వెంకటేశ్వర్లు, వీరేశం, స్వర్ణలత, వెంకటలక్ష్మి, శంకుతల, రాగిణి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత



బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న విశాల

స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల

కేశంపేట: దైవచింతనతోనే ప్రతీ ఒక్కరికి మానసిక ప్రశాంతత లభిస్తుందని స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బైర్కాన్‌పల్లి గ్రామంలో స్వయంభూ వెలసిన గుంటుక శ్రీలక్ష్మీనరసింహ్మస్వామి బ్రహ్మోత్సవాలను గ్రామస్తులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం బండలాగుడు పోటీలను ఆమె ప్రారంభించారు. అనంతరం విశాల మాట్లాడుతూ గ్రామస్తులు ఐక్యంగా ఉండి కార్యక్రమాలను జరుపుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే పోటీలు ప్రజల మధ్య స్నేహబంధం పెంపొందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణయ్య, తాండ్ర శ్రావణ్‌రెడ్డి, రూప్లానాయక్, అంజయ్య, యాదగిరిరావు, వెంకటయ్య, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులపై కేసులు ఎత్తివేయండి

ఆలిండియా క్రిస్టియన్ ఫెలోషిప్ సభ్యుల డిమాండ్



వినతిప్రతం అందజేస్తున్న ఆలిండియా ఫెలోషిప్ సంఘం నాయకులు

చేవెళ్ల: శంకర్‌పల్లి మండలంలోని జన్వాడలో క్రైస్తవులపై జరిగిన దాడిలో బాధితులపై నమోదైన కేసులను ఎత్తి వేయాలని ఆలిండియా క్రిష్టయన్ ఫెలోషిప్ సభ్యులు డిమాండ్ చేశారు. చేవెళ్ల మండలకేంద్రంలోని మౌంట్ కార్మెల్ చర్చిలో మంగళవారం ముఖ్య నాయకులు, ఆలిండియా క్రిస్టియన్ ఫెలోషిప్ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు జన్వాడాలోని బాధితులకు అండగా ఉంటామన్నారు. వారికి న్యాయం చేయాలని కోరుతూ చేవెళ్ల ఆర్డీఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధితులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. తమ వారిపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, క్రైస్తవ పరిరక్షణ చట్టం తీసుకురావాలన్నారు. లేదంటే తాము ఏకమై రాష్ట్రస్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమస్యల పరిష్కారం కోసం, హక్కుల సాధనకు అందరూ కలిసి పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో బిషప్ ఏసుదాస్, పాస్టర్లు జహంగీర్, ఎలియాజర్, ప్రభుదాస్, క్రిష్టపర్, దానియల్, సుదర్శన్, జోసెఫ్, పురుషోత్తం, ఇమ్మన్యూయేల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన టిప్పర్



ప్రీకాస్ట్ ప్రహరీని ఢీ కొట్టి నిలిచిపోయిన టిప్పర్



కూలిన విద్యుత్ స్తంభం

తప్పిన ప్రమాదం

కడ్తాల్: షాద్‌నగర్-కడ్తాల్ ప్రధాన రహదారిపై టిప్పర్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన ప్రకారం..మంగళవారం తెల్లవారు జామున టిప్పర్ కడ్తాల్ నుంచి తలకొండపల్లి వైపు ప్రయాణిస్తోంది. మార్గమధ్యలో టాక్‌రాజ్‌గూడ వద్ద వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి పక్కనే వ్యవసాయ పొలానికి ఏర్పాటు చేసిన ప్రీకాస్ట్ ప్రహరీని గుద్దుని నిలిచిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంతో కడ్తాల్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కరెంట్ ట్రిప్ కావడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అదే సమయంలో రహదారి మీదుగా వెలుతున్న వాహన దారులు, స్థానికులు ప్రమాదాన్ని గమనించి, పోలీసులకు, విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు.